# మెట్‌పల్లిలో మెగా జాబ్ మేళా

జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన క్యూఆర్ కోడ్

- 50 కంపెనీలు, 2000 ఉద్యోగాలు
- నియోజకవర్గ నిరుద్యోగ యువతకు సదవకాశం
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, మార్చి 7: కోరుట్ల నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు కార్పొరేట్ ఉద్యోగావకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో మెట్‌పల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. గురువారం మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మెగా జాబ్‌మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన పదోతరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో ఈ నెల 11న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. ఈ మేళాలో వివిధ కంపెనీలకు చెందిన 50 కార్పొరేట్ సంస్థలు, రెండు వేలకు పైగా ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అనుభవం ఉన్నా, లేకున్నా నిరుద్యోగ యువత ఈ నెల 11 ఉదయం 9గంటల లోపు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాల్సరు. వివరాలకు 9948335533, 7893636313లో సంప్రదించాలని సూచించారు.

### కాంగ్రెస్ హయాంలోనే కరువు

కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో తాగు, సాగు నీటితో కరువు కష్టాలు వచ్చాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విమర్శించారు. గురవారం మెట్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండు టెండల్లో కూడా మాజీ సీఎం కేసీఆర్ హయాంలో సాగు, తాగు నీటికి ఎలాంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయని గుర్తు చేశారు. వేసవి కాలం ప్రారంభం కాక ముందే నీటి ఎద్దడిపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం, నేటికి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించక రాష్ట్రంలో కరువు వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అనడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల సమయంలో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కోరుట్ల నియోజకవర్గంలోని ప్రజలు ఎల్ఆర్ఎస్ కట్టవద్దని సూచించారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ సాయిరెడ్డి, కౌన్సిలర్లు గంగాధర్, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ఎస్‌ను ఉచితంగా అందించాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- ఎల్ ఆర్ఎస్ ఫీజు వసూల్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకుల ధర్నా

జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల, మార్చి 7: ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా వర్తింపజేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ యాస్మిన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో లే అవుట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అనంతరం లేఅవుట్లను కొంత క్రమబద్ధీకరించారన్నారు. నూతన మున్సిపల్ చట్టం తీసుకొచ్చామన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకువచ్చినపుడు మంత్రులు భట్టి, సీతక్క, ఉత్తమ్ ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకించారని గుర్తుచేశారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 25 లక్షల మందికిపైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల నుంచి రూ.20 వేల కోట్లు రాబట్టడానికి ప్రయత్నిస్తున్నదన్నారు. జగిత్యాల పట్టణంలో 8వేల మంది, రాయికల్‌లో 1,900 మంది, మొత్తంగా 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను వర్తింపజేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల హామీకి కట్టుబడి ఎల్ఆర్ఎస్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లను తొలగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఫీజు లేకుండా ఉచిత ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని, లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని, జగిత్యాల పట్టణ మాస్టర్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు, జడ్పీటీసీ అశ్వినీజాదవ్, వైస్ చైర్మన్లు గోలి శ్రీనివాస్, గండ్ర రమాదేవి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీశ్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఖాతా నుంచి రూ.99,670 మాయం

కథలాపూర్, మార్చి 7: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు బ్లాక్ కోసం ఓటీపీ చెప్పాలని కోరాడు. బాధితుడు మూడు సార్లు ఓటీపీ చెప్పడంతో రూ.99,670 బ్యాంక్ ఖాతా నుంచి మాయమయ్యాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

### వన్యప్రాణిని చంపిన వ్యక్తిపై కేసు

రాయికల్, మార్చి 7: వన్యప్రాణిని చంపిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు రాయికల్ ఫారెస్ట్ ఆఫీసర్ భూమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న రాయికల్ మండలం రాజనాగరం గ్రామానికి చెందిన సబావత్ రాజన్న తన వ్యవసాయ పొలం చుట్టూ కరెంట్ తీగను అమర్చాడు. విద్యుత్ తీగ వల్ల సాంబారు మేకం అనే వన్యప్రాణి చనిపోయింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని అడవి జంతువు మాంసం, కత్తులు, కరెంటు తీగలను స్వాధీనం చేసుకున్నారు. సభావాత్ రాజన్న పరారీలో ఉండగా, గురువారం పట్టుకొని అతడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కింద కేసు నమోదు చేశారు. అనంతరం జగిత్యాల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ఇందులో డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రమౌళి, బీటు అధికారి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు

పెగడపల్లి: విద్యుత్ దీపాల వెలుగులో రాజన్న ఆలయం

కథలాపూర్: ముస్తాబైన శివాలయం

ధర్మపురి/పెగడపల్లి /జగిత్యాల రూరల్/వెల్గటూర్/కథలాపూర్/ మారుతీనగర్/జగిత్యాల టవర్ సర్కిల్/మల్లాపూర్/సారంగాపూర్, మార్చి 7: జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, తాగు నీరు, వైద్య సౌకర్యం, భక్తులకు సహాయం చేసేందుకు వలంటీర్లను అందుబాటులో ఉంచారు. స్త్రీల కోసం దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేశారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన రామలింగేశ్వరాలయంలో, పట్టణ శివారులోని అక్కెపెల్లి రాజేశ్వరాలయంలో, నేరెళ్ల సాంబశివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోత్రనామాదులతో పూజలు నిర్వహించే భక్తులు రూ.516 చెల్లించి రసీదు పొందాలని ఈవో శ్రీనివాస్ తెలిపారు. పెగడపల్లిలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, పోచయ్య ఆధ్వర్యంలో గురువారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పూజారులు గుండి శ్రీనివాస్‌శర్మ, రాజేశ్వరశర్మ, వినయ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెగడపల్లిలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయం, జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పొలస్తేశ్వర స్వామి ఆలయం, వెల్గటూర్‌లోని కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయం, గొల్లపల్లి మండలంలోని రాపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, గొల్లపల్లి శివాలయం, లొత్తునూర్ రాజరాజేశ్వర ఆలయం, కథలాపూర్ మండలం పోతారంలోని లొంకరామేశ్వరస్వామి, అంబారిపేటలోని ఓంకారేశ్వరస్వామి, చింతకుంటలోని తారకేశ్వర స్వామి, సిరికొండలోని మహాదేవస్వామి ఆలయాలు, మెట్‌పల్లిలోని ఆరపేట శివాలయం, విద్యానగర్‌లోని శివాలయం, మఠంవాడలోని శివాలయం, జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద గల మడలేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి జాతరకు సిద్ధమయ్యాయి. ఆలయాల్లో శుక్రవారం సామూహిక అభిషేకాలు, రాత్రి శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి లింగోద్భవదర్శనం, శనివారం శోభాయాత్ర, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మల్లాపూర్‌లోని కనకసోమేశ్వరస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రతి ఏటా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. గురువారం ఎస్ఐ కిరణ్‌కుమార్ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సారంగాపూర్‌లోని దుబ్బ రాజేశ్వర స్వామి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ రఘు చందర్ పేర్కొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నా రు. కార్యక్రమంలో ఈవో అనూష, ట్రస్ట్ పౌండర్ శంకరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వైభవంగా శివపార్వతుల కల్యాణం

కొడిమ్యాల, మార్చి 7: మహాశివరాత్రి సందర్భంగా హిమ్మత్‌రావుపేట శివాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జడ్పీటీసీ దంపతులు పునుగోటి ప్రశాంతి-కృష్ణారావు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

### ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 7: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువైంది. భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని వల్లుబండ వద్ద భక్తితో వల్లు పట్టుకున్నారు.

### 'ఇన్‌స్పైర్ మానక్'కు విద్యార్థులు

కథలాపూర్, మార్చి 7: ఇన్‌స్పైర్ మానక్ 2023-24 సంవత్సర అవార్డుకు కథలాపూర్ మాస్టో హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బూస సహస్ర, ఏలేటి పార్వతి రూపొందించిన ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో గుర్తింపు పొందాయి. వీరికి రూ.10 వేల చొప్పున అందించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం ఆకుల రంజిత్ అభినందించారు.

### ఎన్ఎస్‌వీకి గ్రాండ్ చాంపియన్‌షిప్

మల్యాల, మార్చి 7: వేములవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మల్యాల ఎన్ఎస్‌వీ స్కూల్‌కు చెందిన కె. అశ్వత్థామ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్, ఓవరాల్ గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. అశ్వత్థామను చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, కరాటే మాస్టర్ శ్రీనివాస్ అభినందించారు.

### అల్ఫోర్స్‌లో పరివర్తన్ డే

జగిత్యాల, మార్చి 7: సాంస్కృతిక కార్యక్రమాలు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డితో కలిసి జగిత్యాల శివవీధి అల్ఫోర్స్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పరివర్తన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు సరస్వతీ మాత విగ్రహానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 7: అనారోగ్యంతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని అల్లమయ్య గుట్ట కాలనీకి చెందిన ఈర్నల భూమయ్య (50) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరేండ్లుగా తీవ్రమైన షుగర్ వ్యాధి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎన్ని దవాఖానలు తిరిగిన వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

### యాచకురాలి మృతి

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్ షెడ్‌లో గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందింది. గురువారం విగతజీవిగా పడి ఉన్న యాచకురాలిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యాచకురాలికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ దవాఖానలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

### ఆలయ అభివృద్ధికి విరాళం

వెల్గటూర్, మార్చి 7: వెల్గటూర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ దొరిశెట్టి వెంకటయ్య రూ. లక్ష విరాళంగా అందజేశాడు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేర్గు నరేశ్ ఉన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 7: ఓన గుల్లపేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంజం వేణు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బాల ముకుందం, వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సురేందర్, మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా దుబ్బ రాజేశ్వర స్వామి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, మార్చి 7: పెంబట్ల దుబ్బ రాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్ దంపతులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకు వచ్చారు. ఆర్డీవో దంపతులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా డీఎస్పీ రఘు చందర్, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, ఈవో అనూష, ట్రస్టు ఫౌండర్ శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### కొందరికే జీరో బిల్లు

కొడిమ్యాల, మార్చి 7: రేషన్‌కార్డు ఉన్న వారందరికీ 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇస్తామని సర్కారు తెచ్చిన గృహజ్యోతి పథకం వర్తింపులో గందరగోళం నెలకొంటున్నది. కొందరికే జీరోబిల్లులు జారీ చేయగా అనేక మంది అర్హులకు స్కీం అందలేదు. దీంతో మళ్లీ బిల్లులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ బేజారవుతున్నారు. కొడిమ్యాల మండల పరిషత్ ఆఫీసులో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు వినియోగదారులు పోటెత్తారు. ప్రజాపాలన దరఖాస్తు రసీదులను తీసుకొని వచ్చి మళ్లీ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఆదరాబాదరగా ఈ స్కీంను అమలు చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. అర్హులందరికీ జీరో బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు.

### కారులో మంటలు

- అప్రమత్తంగా వ్యవహరించడంతో తప్పిన ప్రాణనష్టం

కథలాపూర్, మార్చి 7: వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన కథలాపూర్ మండలం పోసానిపేట శివారులో జరిగింది. అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదమే తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం కోమల్‌పల్లికి చెందిన జంగం ప్రేమ్‌కుమార్ తన కారులో కుటుంబసభ్యులతో కలిసి గురువారం ఉదయం వేములవాడ రాజన్న దర్శనానికి పయనమయ్యారు. కారులో ప్రేమ్‌కుమార్‌తో పాటు ఆరుగురు ఉన్నారు. కోరుట్ల-వేములవాడ రూట్‌లో పోసానిపేట శివారుకు చేరుకోగానే కారు ముందుభాగం నుంచి పొగలు లేచి మంటలు అంటుకున్నట్లు కనిపించాయి. అప్రమత్తమైన ప్రేమ్‌కుమార్ కారులో ఉన్నవారిని కిందకు దిగమని చెప్పి వస్తువులను తీసే ప్రయత్నం చేశారు. మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా బుగ్గిపాలైంది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు. ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### భగీరథ నీటి సరఫరాపై నిర్లక్ష్యమేలా?

కథలాపూర్, మార్చి 7: 'మిషన్ భగీరథ నీటి సరఫరాలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నరు..భగీరథ ఏఈ సమావేశానికి రాలేదెందుకు?' అని కథలాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీపీ జువ్వాజి రేవతి అధ్యక్షతన నిర్వహించిన మీటింగ్ వాడీవాడిగా సాగింది. గ్రామాల్లో రోజుల తరబడి నీరు రాకున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు ప్రశ్నించారు. ఉపాధి పనులపై సమాచారం ఇవ్వడంలేదని ఎంపీటీసీ బాలు సభలో ప్రస్తావించగా.ఇకనుంచి సమాచారం ఇస్తామని ఏపీవో రాజేందర్ పేర్కొన్నారు. అధికారులు ఆలస్యంగా రావడంపై ఎంపీపీ రేవతి అసంతృప్తి వ్యక్తం చేయగా ఇక నుంచి జరగకుండా చూస్తామని ఎంపీడీవో శంకర్ చెప్పారు. సర్కారు నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని డీటీ శ్రీనివాస్ అన్నారు. ఇక్కడ ఎంపీటీసీలు గంగం దేవేంద్ర, జిల్లా లక్ష్మి, ఎంఈవో ఆనందరావు, వైద్యాధికారులు సింధూజ, రచన, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, చంద్రశేఖర్ ఉన్నారు.

### రంజాన్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలి

జగిత్యాల, మార్చి 7 : రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ముస్లిం మైనార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేపట్టాలని, మసీదులకు నిరంతరంగా కరెంట్ ఇవ్వాలని, నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని కోరారు. రాత్రి వేళల్లో వ్యాపారాలు కొనసాగించుకొనుటకు అనుమతి ఇవ్వాలని సూచించారు. ఇఫ్తార్ టైంలో రోడ్లపై తయారు చేసే తినుబండారాలను తనిఖీ చేయాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ దివాకర్, డీఎస్పీ రఘు చందర్, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డీపీవో దేవరాజ్, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ సాయిబాబా ఉన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడిమ్యాల/ మల్యాల మార్చి 7: కొడిమ్యాల మండలంలో 59 మంది, మల్యాల మండలంలో 36 మంది లబ్ధిదారులకు గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నల్లగొండలో విద్యుత్ ప్రమాదంలో గొర్రెలు మరణించగా రూ. 28 వేలు మంజూరుకాగా, చెక్కును పెంపకందారులకు అందించారు. కొడిమ్యాలలో తహసీల్దార్ రాజమణి, ఎంపీడీవో స్వరూప , ఆర్ఐ రవి. ఎంపీటీసీలు జగన్‌మోహన్‌రెడ్డి, జమల్‌పూరి రాజేశ్వరి, నాయకులు చిలువేరి నారాయణగౌడ్, గడ్డం జీవన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, మ్యాకల మల్లేశం, కడారి మల్లేశం, మొగిలి నర్సయ్య, గోల్కొండ రాజు, మల్యాలలో తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, నాయకులు ఆదిరెడ్డి, దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వెల్మ లక్ష్మారెడ్డి, లక్ష్మణాచారి, సతీశ్‌రెడ్డి, మిట్టీ శ్రీనివాస్ ఉన్నారు.

# కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం

- ప్రొటోకాల్ విస్మరిస్తే సహించేది లేదు
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్/సారంగాపూర్, మార్చి 7: కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాయికల్ తహసీల్ కార్యాలయంలో గురువారం 125 మంది లబ్ధిదారులకు రూ.1.25 కోట్ల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ కృషితో డీ52 కెనాల్‌కు తూము పెట్టి రాయికల్‌లో తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడంతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. వేసవిలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, అధికారులు నీటి కొరత రాకుండా చూడాలన్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించాలని, విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గుడికోట ఆలయం వద్ద రూ.కోటితో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కాగా బీర్‌పూర్‌లోని రైతువేదిక ఆవరణలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, ఎంపీపీలు సంధ్యారాణి, రమేశ్, వైస్ ఎంపీపీలు మహేశ్వర రావు, లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీలు అశ్విని జాదవ్, పద్మారమేశ్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఇంతియాజ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్, విండో చైర్మన్ నవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై నిరసన

రాయికల్, మార్చి 7: రాయికల్ తహసీల్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం స్టేజీపైన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలతో అధికారులు ఫ్లెక్సీని పెట్టారు. ప్రొటోకాల్ ప్రకార